క్లుప్తంగా

నియామకపత్రం అందజేత



నందిపేట్: మండలంలోని లక్కంపల్లికి చెందిన సాదరి సాగర్ జిల్లా చేతి వృత్తుల సెల్ జిల్లా కన్వీనర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. చేతివృత్తులు అంతరిస్తున్న కాలంలో వాటికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. తనకు పదవి కేటాయించిన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మైనారిటీ కళాశాల విద్యార్థి ప్రతిభ



వివేక్ రెడ్డి

రుద్రూర్: కోటగిరి మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థి జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ ముబీన్ తెలిపారు. సెకండియర్ విద్యార్థి వడియాల వివేక్ రెడ్డి జేఈఈ మెయిన్స్ క్లియర్ చేసి అడ్వాన్స్‌కు అర్హత సాధించారని వెల్లడించారు. అనంతరం వివేక్ రెడ్డిని కళాశాల అధ్యాపక బృందం సభ్యులు అభినందించారు.

బీజేపీలో చేరిక



భీమ్‌గల్: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు జక్కుల కార్తిక్ శుక్రవారం తిరిగి బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రూ. 5 లక్షల చెక్కు అందజేత



కమ్మర్‌పల్లి: హాసకొత్తూర్‌లో 5 నెలల క్రితం విద్యుదాఘాతంతో మరణించిన సామ చిన్న గంగాధర్ కుటుంబ సభ్యులకు ట్రాన్స్‌కో అధికారులు రూ. 5 లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. గంగాధర్ కల్లంలో ధాన్యం ఆరబోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌కు 11 కే.వీ విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ట్రాన్స్‌కో శాఖ మంజూరు చేసిన రూ. 5 లక్షల చెక్కును మృతుని భార్య సామ అమృతకు ఏడీ వినోద్, ఏఈ బాలరాజు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏనుగు పద్మ, మాజీ ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, సబ్ ఇంజినీర్ రమేశ్, మహిపాల్, మహేశ్, శ్రావణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



డొంకేశ్వర్: మండలంలోని దత్తాపూర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో జగదాంబ మాత, సేవాలాల్ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో యజ్ఞ హోమాలు, పూర్ణహుతి, పూజలు చేపట్టారు .అనంతరం అన్నదానం చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బంజార యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో 'విద్య-వెలుగు'

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విద్యా హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో 'విద్య-వెలుగు' అనే కార్యక్రమాన్ని ఈ నెల 28 నుంచి మే 30 వరకు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ శుక్రవారం తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు చదువుకునే సదుపాయం కల్పిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు 9030425910 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు పతకాలు అందజేత



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద పాఠశాలలో శనివారం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు యాజమాన్యం పతకాలు అందజేశారు. కార్యక్రమంలో నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం

- 2015లో మొదలైన పనులు
- ఇబ్బందుల్లో మహిళా సంఘాల సభ్యులు



పునాదులకే పరిమితమైన స్త్రీశక్తి భవన నిర్మాణం



ఏర్పాటు చేసిన శిలాఫలకం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని స్త్రీశక్తి భవన నిర్మాణం పునాదులకే పరిమితమైంది. పట్టణంలోని 35వ వార్డులో చేపడుతున్న ఈ భవన నిర్మాణానికి 2015లో నాటి ఎంపీ కల్వకుంట్ల కవిత భవనానికి భూమి పూజ చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మళ్లీ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కాగా ఆ భవనం పునాదులకే పరిమితమైంది. సుమారు రూ. 25లక్షల వ్యయం అంచనాతో పనులు ప్రారంభించినా భవనం పూర్తి కాలేదు. ఆర్మూర్‌లో మొత్తం 934 మహిళా సంఘాలు, 9340 మంది సభ్యులు ఉన్నారు. ఆర్పీలు, సమాఖ్య అధ్యక్షులు మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తారు. స్త్రీశక్తి భవనం పూర్తి కాకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెట్ల కింద, అద్దె భవనాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా మహిళా స్త్రీశక్తి భవన నిర్మాణం పూర్తి చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

సీఆర్పీ భవన నిర్మాణానికి ఎవరు ముందుకు రావడం లేదు. ఏ కాంట్రాక్టర్ ఈ భవన నిర్మాణానికి టెండర్ వేయడం లేదు. దీంతో సీఆర్పీ భవనం పునాదులకే పరిమితమైంది. ప్రస్తుతం దీని పరిస్థితి అధ్వానంగా తయారైంది. సుమారు 9 ఏళ్ల క్రితం చేపట్టిన పనులు అలాగే ఉన్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిస్తా

నిలిచిపోయిన సీఆర్పీ భవన నిర్మాణానికి టీఎల్ఎఫ్ తరఫున ఉన్నత అధికారులను కోరుతాం. భవనం పూర్తయితే మహిళా సంఘాల సమావేశాలు నిర్వహిస్తాం.

– ఉదయ్‌శ్రీ, టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్, ఆర్మూర్

జోరుగా బీజేపీ నాయకుల ప్రచారం



మంగళ్‌పాడ్‌లో ప్రచారం చేస్తున్న మోహన్‌రెడ్డి



హంగర్గాలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

ఎడపల్లి/ బోధన్‌రూరల్/ మాక్లూర్: ఎడపల్లి మండలంలోని మంగళ్‌పాడ్, కుర్నాపల్లి గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రెడ్డి, మండల నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీధర్, ఇంద్రకరణ్, రాజేందర్, గెంటె సీను, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు. బోధన్ మండలంలోని హంగర్గలో ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరివ్రింద్‌కు మద్దతుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, మండల అధ్యక్షుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్‌లో బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనె సంతోష్, మండల ఇన్‌చార్జి పుప్పాల శివరాజ్ నాయకులతో కలిసి ఎంపీ అర్వింద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గంగోనే వినోద్, శ్రీకాంత్, మంతెన జట్టి గంగాధర్, పిట్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్, ఆలూర్ బైపాస్, పిప్రి రోడ్ వద్ద శుక్రవారం రాత్రి ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేపట్టారు. వాహనదారులు, ప్రయాణికులు రూ. 50వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దని సూచించారు. ఎస్‌హెచ్‌వో రవికుమార్, ఎస్సై జి.గంగాధర్, హన్మాండ్లు, అంజమ్మ, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి



ఫత్తేపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వినయ్‌రెడ్డి



మంగళ్‌పాడ్‌లో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ఆర్మూర్/ ఎడపల్లి/ రెంజల్/ బోధన్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్, సుర్బిర్యాల్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు చేపడుతున్న పనుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఫత్తేపూర్, కోమన్‌పల్లికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మారచంద్రమోహన్, జిల్లా డీసీఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ ఫతేపూర్ శ్రావణ్‌రెడ్డి, ఆర్మూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి, మంగళ్‌పాడ్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌రావు, బిల్లా రామ్మోహన్, జెడ్పీ వైస్ చైర్మన్ రజిత ఎల్లయ్య యాదవ్, ఈరంటి లింగం, భాస్కర్‌రెడ్డి, ఫరాన్, సంజయ్, నవీన్, రాజ్‌గౌడ్, ఎజాస్, కొండ్ర రాములు, శేఖర్‌రెడ్డి, పరిగె సాయిలు, హన్మంత్ రెడ్డి, అజ్జపు రవి, బుడ్డ పోశెట్టి, సంతోష్ గౌడ్, కరుణాకర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రెంజల్ మండలంలోని కళ్యాపూర్, కూనేపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలకు కాంగ్రెస్ పథకాలపై అవగాహన కల్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు ధనుంజయ్, సాయరెడ్డి, రాములు, గయాస్, జావిద్, ఒడ్డెక్క మోహన్, సాయినాథ్, నీరడి సాయిలు, శ్రీనివాస్‌గౌడ్, మర్ల రమేశ్, సురేశ్ పటేల్, పోచయ్య, కృష్ణ, రాజు, సాయిలు, ప్రభాకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లోని రాకాసీపేట్‌లో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్, కౌన్సిలర్ శరత్ రెడ్డి, హరికాంత్ చారి, ప్రమోద్, విష్ణు, దాము తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ వైభవంగా మహా చండీ యాగం



బోధన్: పట్టణ కేంద్రంలోని విజయసాయి హైస్కూల్ ప్రాంగణంలోని గణపతి ఆలయం ఎదుట సహస్ర లింగార్చనాత్మక మహా చండీ యాగం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా కొనసాగిన చండీ యాగం శుక్రవారం ముగిసింది. వేదపండితులు వామన శర్మ, మూర్తి సూర్యనారాయణ యాగం, గణపతి, నక్షత్ర, నవగ్రహ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో గణపతి ఆలయం నిర్మించి 21 ఏళ్లు పూర్తయిన సందర్భంగా యాగం నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం కృష్ణ మోహన్ తెలిపారు. కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

■ ఘనంగా శివనామ సప్తాహం

బోధన్‌రూరల్: పట్టణంలోని చక్రేశ్వర శివాయలం లో వీరశైవ సమాజ్ ఆధ్వర్యంలో 19వ అఖండ శివ నామ సప్తాహం వైభవంగా కొనసాగుతోంది. 7వ రోజైన శుక్రవారం వీరశైవ పవిత్ర గ్రంథమైన పరమరహస్య పారాయణ పఠనం నిర్వహించారు. 108 షతస్థల బ్రహ్మ సిద్ధ దయాల్ శివాచార్య స్వామీజీ, బెట్ మొగ్రా పీఠాధిపతులు శివనామ సప్తహం గురించి ప్రవచనం చేశారు. కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు అజయ్ వడియార్, పురాణే అజయ్ కుమార్, నర్సింగ్ అప్ప, శంకరప్ప, విఠలప్ప, సుంకిని శివ, శివకుమార్, షట్కర్ శివ, రవి పటేల్, గణపతి అప్ప, నాగనాథ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



■ ఎడపల్లిలో రేణుకా ఎల్లమ్మ కల్యాణం

ఎడపల్లి: మండల కేంద్రంలో గౌడ సంఘం సభ్యులు రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గండ్లకు మరమ్మతులెప్పుడో!



- లక్ష్మీకాలువకు పలు చోట్ల గండ్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే లక్ష్మి కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో ఏటా సాగు నీరు వృథా అవుతోంది. ముప్కాల్ మండలం నల్లూర్ శివారులో కాలువ ఎగువ భాగం నుంచి పొలాల నీరు ఎక్కువగా రావడంతో భారీ గండి పడింది. అంతే కాకుండా కాలువపై ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. కాని అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రస్తుతం ఆయకట్టుకు నీటి విడుదల నిలిపి వేయడంతో కాలువకు మరమ్మతులు చేపట్టడానికి అనువుగా ఉంటుంది. కానీ అధికారులు చర్యలు చేపడుతారా లేదా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గండ్లు పడటంతో నీరు వృథా అవుతుండటంతో పాటు కాలువ వెంట వెళ్లడానికి ఇబ్బంది అవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో మరమ్మతులు చేపట్టకపోతే వానాకాలంలో మరింత కోతకు గురై పెద్ద గండి ఏర్పడే ప్రమాదం ఉంది. అధికారులు సకాలంలో ప్రతిపాదనలు పంపి వానాకాలం నాటికి పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

లక్ష్మీకాలువపై వానాకాలంలో పడిన గండ్లను పరిశీలించాం. ఎక్కువగా కోతకు గురైన చోట ముందుగా మరమ్మతులు చేపట్టి, తర్వాత బాగు చేయడానికి ప్రతిపాదనలు పంపుతున్నాం. వేసవిలో పనులు పూర్తయ్యేల చర్యలు తీసుకుంటున్నాం.

– శేఖర్‌బాబు, ఏఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

- అన్ని జీపీ కార్యాలయాల్లో ఏర్పాటు
- అధికారుల చొరవపై ప్రశంసలు



జోర్‌పూర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం



సిద్ధాపూర్‌లో..



బజార్‌కొత్తూర్‌లో..

నందిపేట్: వేసవి కాలం ఎండలు మండిపోతున్నాయి. ఎండ వేడికి ఇంటి నుంచి బయటకు వచ్చిన ప్రజల గొంతెండుతోంది. దీంతో వారి దాహార్తిని తీర్చిదిద్దేందుకు అధికారులు ముందుకొచ్చారు. నందిపేట మండలంలోని ప్రతి జీపీ కార్యాలయాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంతో దూరం నుంచి పనుల నిమిత్తం జీపీ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చొరవ తీసుకున్నారు. చల్లని తాగునీటిని అందిస్తున్నారు. మండలంలోని జీపీలకు ప్రతి రోజు వివిధ రకాల పనుల నిమిత్తం పదుల సంఖ్యలో గ్రామస్తులు వస్తూ పోతుంటారు. గత నెల రోజుల నుంచి ఎండలు మండిపోతున్నాయి. ఇంటి నుంచి జీపీకి కొందరు పనుల నిమిత్తం ఎండలో కాలి బాటన వస్తుంటారు. జీపీ కార్యాలయానికి చేరుకోగానే అలసిపోతూ తాగు నీటి కోసం ఎదురు చూసిన ఘటనలు అధికారుల దృష్టికి వచ్చాయి. ఈ విషయాన్ని గమనించిన అధికారులు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నిర్వహణ ఖర్చు అంతా ఆయా జీపీలే భరిస్తోంది. ప్రతినిత్యం ఫిల్టరు వాటరును సరఫరా చేయించి రంజనులలో చల్లని తాగునీటిని ప్రజలకు అందిస్తున్నారు. దీంతో ప్రజలు సంతోషించి అధికారులను ప్రశంసిస్తున్నారు.

ప్రజల కోసం ఏర్పాటు

జీపీలకు నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు పనుల నిమిత్తం వస్తు పోతుంటారు. వేసవిలో ఎండ తీవ్రతతో జీపీలకు వచ్చే వారు తాగునీటి కోసం అల్లాడుతున్నట్లు గమనించాను. వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సంకల్పించాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, నందిపేట మండలం

నిర్వహణ ఖర్చు జీపీలదే..

మండలంలోని అన్ని జీపీల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశాం. నిర్వహణ ఖర్చులను జీపీయే భరిస్తుంది. వేసవిలో ఉన్నన్ని రోజులు ప్రతి నిత్యం ప్రజల దాహార్తిని తీర్చిదిద్దేందుకు చల్లని నీటిని అందించడం సంతోషంగా ఉంది.

– కిరణ్‌కుమార్, ఎంపీవో, నందిపేట

వాహనాలను తనిఖీ చేయాలి

ఆర్మూర్‌టౌన్: ఎన్నికల్లో నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తహసీల్దార్ గజానాన్ అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఫ్లైఓవర్ వద్ద పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వైద్యాన్ని సేవా దృక్పథంతో చేపట్టాలి



నందిపేట్: వైద్యం లాభాపేక్షతో కాకుండా సేవా దృక్పథంతో చేపట్టాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భవాని ఆస్పత్రిని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భూతం సాయారెడ్డి, గంగాధర్‌గౌడ్, లింగారెడ్డి, చిన్నారెడ్డి, కొండూర్ రాజు, నాగసురేశ్, గాండ్ల నర్సాగౌడ్, కుమ్మరి చిన్నయ్య పాల్దొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



వర్ని: మండల తహసీల్దార్‌గా సాయిలు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన మోతీసింగ్ వాల్యా నిధుల దుర్వినియోగం ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురయ్యారు. మోస్రా డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సాయిలును వర్ని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

బోర్డుపై పేరు మార్చండి సారూ..!



సమాచారం తెలిపే బోర్డుపై బదిలీపై వెళ్లిన ఎస్సై పేరు

రుద్రూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం తెలిపే బోర్డుపై బదిలీపై వెళ్లిన ఎస్సై నీరేశ్ పేరు అలాగే ఉంది. ఈయన బదిలీ తర్వాత మరో ఎస్సై మహేందర్ వచ్చారు. ఈయన కూడా బదిలీ అయ్యారు. ప్రస్తుతం అప్పారావు ఎస్సైగా కొనసాగుతున్నారు. ఐతే బోర్డుపై పౌర సమాచార అధికారిగా గతంలో పని చేసి బదిలీపై వెళ్లిన ఎస్సై నీరేశ్ పేరు ఉండడంతో పీఎస్‌కు వచ్చిన వారు చూసి ఆశ్చర్య పోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బోర్డుపై పేరును మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సభను విజయవంతం చేయాలి



ఆర్మూర్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌లో ఉన్న మున్నూరు కాపు కల్యాణ మండపంలో తెలంగాణ ప్రజాస్వామ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు అన్నారు. పట్టణంలోని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో సూర్య శివాజీ, ఎండీ ఖాజా, సురేశ్ బాబు, ఎస్ రవి, లక్ష్మి, మణెమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు



వన్నెల్(బి)లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బాల్కొండ: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజలను మోసం చేస్తున్నాయని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కిసాన్‌నగర్, వన్నెల్(బి) గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. దేవుని పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని అన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ఎంపీటీసీ రాంరాజుగౌడ్, బోజేందర్, నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మంజుమ్మల్ బాయ్స్ - 12.30 టిల్లు స్కేర్ - 3.35, ది ఫ్యామిలీ స్టార్ - 6.35 కొంచెం హట్కె (తెలుగు) - 10.00
స్క్రీన్-2 –	టిల్లు స్క్వేర్ - 12.20, 6.45, 9.45 ది ఫ్యామిలీ స్టార్ - 3.20
స్క్రీన్-3 –	రత్నం (తెలుగు)- 11.30, 2.45, 6.00, 9.15
స్క్రీన్-4 –	మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 12.35, 3.30, 6.35, 9.30

మొక్కలు నాటిన విద్యార్థులు

రుద్రూర్: రాయకూర్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం జీపీ, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మామిడి, జామ, దానిమ్మ మొక్కలు నాటి స్థానికులకు పచ్చదనం ప్రాధాన్యతపై వివరించారు. అనంతరం శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు సమీన్, జె.సాయిప్రసాద్ పాల్గొన్నారు.

